జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 01-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 771 పేజీలు: 4 వెల: రూ.7

## గ్రామస్థుల సమస్యలు తెలుసుకునేందుకే..
# పల్లె నిద్ర

* ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం
* ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరా అమర్చండి
* గంజాయిపై సమాచారం ఇవ్వండి
* గ్రామాల్లో గొడవలు జరగకుండా చూడాలి
* ప్రతి 15 రోజులకు గ్రామాన్ని సందర్శించేలా దత్తత కానిస్టేబుల్
* జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి
* సీసీ కెమెరాల ఏర్పాటు, మాదక ద్రవ్యాల ప్రభావం, సమస్యలపై గ్రామస్థులతో చర్చ
* కళింగపట్నంలో పల్లెనిద్ర




శ్రీకాకుళం, ఆగస్టు 31 (వార్త): గ్రామస్థుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే 'మెగా పల్లె నిద్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. గత వారం రోజులుగా జిల్లాలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి కళింగపట్నంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గ్రామస్థులతో ముఖాముఖి మాట్లాడారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్పీ స్థాయి అధికారి వరకు పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాలను సందర్శించి గ్రామస్థులతో మమేకమై వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటారన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, పోలీసు శాఖకు సంబంధించిన సమస్యలను పరిశీలించి పరిష్కరించడంతో పాటు, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణ, నేరాల ఛేదనలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి గ్రామంలో ముఖ్యమైన ప్రాంతాలతో పాటు వీలైనంత వరకు ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా నేరస్తులను గుర్తించడం, నేరాల దర్యాప్తులో ఆధారాలను సేకరించడం సులభతరం అవుతుందని తెలిపారు. యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల క్రయవిక్రయాలు, రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. గ్రామాల్లో గంజాయి క్రయవిక్రయాలు, రవాణా లేదా ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఎటువంటి అనవసర గొడవలు, ఘర్షణలకు తావు లేకుండా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, మహిళల భద్రత, సైబర్ నేరాలు, భూ వివాదాలు, ట్రాఫిక్ సమస్యలు, పబ్లిక్ న్యూసెన్స్ తదితర అంశాలపై ప్రజలతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి గ్రామానికి దత్తత



కానిస్టేబుల్‌ను నియమించి, ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామాన్ని సందర్శించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. పోలీసుల వైపు నుంచి ఎక్కడైనా నిర్లక్ష్యం లేదా విధుల్లో అలసత్వం కనిపిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ పైడిపు నాయుడు, ఎస్బి ఇన్స్పెక్టర్ ఇమ్మాన్యూల్ రాజ్, ఎస్సై గంగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 2029లో వైసీపీ..
# విజయం ఖాయం

* మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్
* ఏడు రోడ్ల కూడలి నుంచి టౌన్ హాల్ వరకూ వైసీపీ శ్రేణులతో కలిసి ర్యాలీ
* వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి
* టౌన్‌హాల్‌లో వైసీపీ జిల్లా కార్యాలయం ప్రారంభం
* తరలివచ్చిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ శ్రేణులు

శ్రీకాకుళం, ఆగస్టు 31 (వార్త): 2029లో వైసీపీ విజయం ఖాయమని మాజీ మంత్రి, పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్ ప్రాంగణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా కార్యాలయాన్ని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో కలిసి సోమవారం ప్రారంభించారు. తొలుత శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడ నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో కలిసి టౌన్ హాల్ వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. ఆ తర్వాత ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ధర్మాన కృష్ణదాస్ మాట్లాడారు. గతంలో 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యాచరణను కూడా ఇదే టౌన్ హాల్ కేంద్రంగా ప్రారంభించి జిల్లా వ్యాప్తంగా అఖండ విజయం సాధించామన్నారు. మళ్లీ ఇప్పుడు ఇదే టౌన్ హాల్ నుంచి జిల్లా పార్టీ పూర్తిస్థాయి కార్యకలాపాలు నిర్వహించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగిందన్నారు. పార్టీ కార్యాలయ నిరంతర నిర్వహణ కోసం నరసన్నపేట నియోజకవర్గం నుంచి రూ.5 లక్షల విరాళం చెక్కును యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ బూడి ముత్యాల నాయుడు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కోఆర్డినేషన్ హర్షవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, పాలవలస విక్రాంత్, పెనుమర్తి సురేష్ బాబు, మాజీ శాసనసభ్యులు గొర్లె కిరణ్ కుమార్, రెడ్డి శాంతి, నియోజకవర్గ సమన్వయకర్తలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, సాడే శ్యాంప్రసాద్ రెడ్డి, యువ నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, నియోజకవర్గ పరిశీలకులు,



జెడ్పీటీసీలు, ఎంపీపీలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలాల అనుబంధ విభాగ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, మాజీ పట్టణ వార్డు సభ్యులు, వేలాదిగా పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ప్రభుత్వాసుపత్రిలో 'వైద్య' సేవలెక్కడ?

**- పలాస ఆసుపత్రిని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆకస్మిక తనిఖీ**

**- ఉదయం వేళ వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం**

**- ప్రమాద బాధిత ఉపాధ్యాయులకు సకాలంలో వైద్యం అందలేదని ఫిర్యాదులు**

**- హాజరు వేసి ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్తున్నారన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశం**

**పలాస, ఆగస్టు 31 (వార్త):** పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల అందుబాటు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై వరుసగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యుల హాజరు, రోగులకు అందుతున్న సేవలు, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది స్పందిస్తున్న తీరుపై ఆమె ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.



### ఉపాధ్యాయుల ప్రమాద ఘటనపై ఆరా..

కాశీబుగ్గ సమీపంలోని గరుడఖండి జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు ఉపాధ్యాయులు గాయపడిన విషయం తెలిసిందే. ఉపాధ్యాయుల సమావేశానికి వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. గాయపడిన వారిని ఉదయం సుమారు 6.30 గంటలకు పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో చికిత్స కోసం కొంతసేపు వేచి ఉండాల్సి వచ్చిందని బాధితులు, స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఉదయం 6.30 గంటలకు ఆసుపత్రికి చేరుకున్నప్పటికీ సుమారు 8 గంటల వరకు వైద్యులు అందుబాటులో లేకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమా దం వంటి అత్యవసర పరిస్థితుల్లోనూ వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వైద్యుల పనితీరుపై మండిపడ్డారు. కొంతమంది వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో హాజరు వేస్తున్నప్పటికీ ప్రైవేటు క్లినిక్‌లకు మొగ్గు చూపిస్తారని, ఆసుపత్రికి వచ్చి హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేసిన అనంతరం కొందరు వైద్యులు ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్తున్నారన్న ఆరోపణలు కూడా ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ రోగులకు అందుబాటులో లేకపోవడం ఎంతవరకు సమంజసమని అంటూ ఆమె వైద్యులు తీరిపై విరుచుకుపడ్డారు. బాధ్యతాయుతమైన వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేదని, ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బాధ్యులైన వైద్యులు జరిగిన ఘటనపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

### జిల్లా వైద్యాధికారులతో కీలక భేటీ

పలాస ప్రభుత్వ ఆసుపత్రి పనితీరుపై సోమవారం సాయంత్రం జిల్లా వైద్యాధికారులతో ఎమ్మెల్యే గౌతు శిరీష కీలక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది. వైద్యుల హాజరు, అత్యవసర వైద్య సేవలు, రోగులకు అందుతున్న చికిత్స, ఆసుపత్రి నిర్వహణ తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ఉపాధ్యాయులు ప్రమాదానికి గురైన ఘటనపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా ఆరా తీసి వివరాలు తెలుసుకున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల తీరుపై స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## హరికృష్ణమ్మపేటలో పోలింగ్ బూత్ మార్పుపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

**- రాజకీయ దురుద్దేశంతోనే మార్పు చేస్తున్నారని ఎంపీపీ ఆరోపణ**

**- పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి**

**జలుమూరు, ఆగస్టు 31(వార్త):** లింగాలవలస పంచాయతీ పరిధిలోని హరికృష్ణమ్మపేటలో పోలింగ్ బూత్ మార్పు అంశంపై ఎంపీపీ గోపి సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. పోలింగ్ కేంద్రాన్ని మార్చే ప్రక్రియపై స్థానికంగా నెలకొన్న అభ్యంతరాలను పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపాలని ఆయన కోరారు. హరికృష్ణమ్మపేటలో ఉన్న పోలింగ్ బూత్‌ను మార్పు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని, దీనివెనుక రాజకీయ దురుద్దేశం ఉందని ఎంపీపీ తన వినతిపత్రంలో పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకుల సిఫార్సుల మేరకే పోలింగ్ బూత్ మార్పు ప్రక్రియ కొనసాగుతోందని ఆరోపించారు. పోలింగ్ కేంద్రం మార్పుతో స్థానిక ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, ఈ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజలకు అనుకూలంగా, ఎలాంటి రాజకీయ ప్రభావాలకు తావులేకుండా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిని పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపట్టాలని ఎంపీపీ గోపి కోరారు.



# సమస్య చెబితే రాజకీయమా..?

**-తాగునీటి కోసం మహిళల ఆందోళన..**

**సంతబొమ్మాళి, ఆగస్టు 31 (వార్త):** తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరితే దానికి రాజకీయ రంగు పులమడం ఎంతవరకు సమంజసమని సీతానగరం గ్రామ మహిళలు ప్రశ్నించారు. సోమవారం వారు మాట్లాడుతూ.. ` రెండేళ్లుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం లభించలేదని తెలిపారు. ప్రస్తుతం తమ గ్రామం మీదుగా తాగునీటి పైప్‌లైన్ పనులు చేపడుతున్న నేపథ్యంలో.. ముందుగా గ్రామంలోని తాగునీటి సమస్యను పరిష్కరించిన అనంతరం పైప్‌లైన్ పనులు కొనసాగించాలని కోరుతూ పనులను అడ్డుకున్నామని మహిళలు స్పష్టం చేశారు. తమకు తాగునీరు అందించాలనే డిమాండ్ తప్ప ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని పేర్కొన్నారు. అయితే పైప్‌లైన్ పనులను అడ్డుకోవడం వెనుక స్థానిక ఎంపీటీసీ సుధాకర్ ఉన్నారని, అధికార పార్టీ నాయకులు ఆరోపించడం సరికాదని మహిళలు మండిపడ్డారు. "మా సమస్య మాకు ముఖ్యం.. రాజకీయాలతో మాకు ఎలాంటి సంబంధం లేదు. తాగునీటి సమస్య పరిష్కరించాలి.. అంతే" అని స్పష్టం చేశారు. ప్రజల కనీస అవసరమైన తాగునీటి కోసం మహిళలు ప్రశ్నిస్తే దానిని రాజకీయంగా చూడటం బాధాకరమని అన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎంపీటీసీ బత్సల సుధాకర్ తన సొంత నిధులతో రెండు బోర్లు, ప్రభుత్వ నిధులతో మరో రెండు బోర్లు వేయించారని ఈ సందర్భంగా మహిళలు తెలిపారు.

ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాకపోవడంతోనే అధికారులను ప్రశ్నిస్తున్నామని చెప్పారు. తాగునీటి సమస్యను రాజకీయం చేయకుండా అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని సీతానగరం మహిళలు డిమాండ్ చేశారు.



రాష్ట్రస్థాయి గట్కా పోటీలకు

# నరసన్నపేట పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులు

**- జిల్లాస్థాయి పోటీల్లో 14 మంది విద్యార్థుల ప్రతిభ**

**- వివిధ విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులు**

**- విజయవాడలో వచ్చే నెల 11, 12 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు**

**నరసన్నపేట, ఆగస్టు 31 (వార్త):** నరసన్నపేట పీఎం శ్రీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి గట్కా పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన వివిధ తరగతుల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపవతి సోమవారం తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో వివిధ తరగతులకు చెందిన 14 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం పాఠశాలకు గర్వకారణమని హెచ్ఎం పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలు వచ్చే నెల 11, 12 తేదీల్లో విజయవాడలో నిర్వహించ ` నున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులు మరింత క్రమశిక్షణతో సాధన చేసి రాష్ట్రస్థాయిలోనూ మంచి ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు. విద్యార్థులు క్రీడా, విద్యా రంగాలతో పాటు వివిధ సహపాఠ్య కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచడం పట్ల పాఠశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

# ప్రజాసేవతోనే ఉద్యోగికి గుర్తింపు

**- పదవీ విరమణ సందర్భంగా జి.వి. రవికుమార్‌కు అభినందనలు**

**- పరిపాలనలో ప్రత్యేకత చాటుకున్నారని ధర్మాన కృష్ణచైతన్య ప్రశంస**

**- ప్రజలకు అందించిన సేవలను కొనియాడిన నాయకులు**

**పోలాకి, ఆగస్టు 31 (వార్త):** ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందించే సేవలే ఉద్యోగికి మంచి గుర్తింపును తీసుకొస్తాయని వైసీపీ నేత, జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. పోలాకి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేసిన జి.వి.రవికుమార్ పదవీ విరమణ సందర్భంగా సోమవారం ఆయనను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేయడం ద్వారా ప్రజల మన్ననలు పొందగలరన్నారు. రవికుమార్ తన ఉద్యోగ కాలంలో పరిపాలనలో ప్రత్యేకతను చాటుకున్నారని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారని ప్రశంసించారు. మండల అభి వృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అధికారిగా తనదైన శైలిలో సేవలందించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన అనుభవాలు సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రవికుమార్‌కు నాయకులు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



# రహదారి భద్రతకు మహిళల శ్రమదానం

**సారవకోట, ఆగస్టు 31(వార్త):** రహదారి భద్రతపై అవగాహనతో లంబ గ్రామానికి చెందిన మహిళలు వినూత్న చొరవ చూపారు. తెంబూరు-హిరమండలం ప్రధాన రహదారిలోని గ్రామ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా విపరీతంగా పెరిగిన కలుపు మొక్కలు, పిచ్చి మొక్కలు, డొంకలను సోమవారం స్వయంగా తొలగిస్తూ శ్రమదానం చేపట్టారు. కొంతకాలంగా రహదారికి ఇరువైపులా వృక్ష, పొదలు పెరిగి రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతం పూర్తిగా కప్పుకుపోయింది. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు ముందుగా కనిపించకపోవడంతో



వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండటంతో సమస్యను గుర్తించిన మహిళలు స్వచ్ఛందంగా రంగంలోకి దిగారు. పనిముట్లను చేతబట్టి రహదారి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, కలుపు మొక్కలు, డొంకలను తొలగించి వాహన దారులకు రహదారి స్పష్టంగా కనిపించేలా చేశారు. ప్రజల భద్రత కోసం ఎవరూ ముందుకు వచ్చేవరకు ఎదురుచూడకుండా మహిళలు స్వయంగా శ్రమదానం చేయడం స్థానికంగా అభినందనీయంగా మారింది. రహదారుల పక్కన పెరిగే మొక్కలు, పొదలను ఎప్పటికప్పుడు తొలగించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

# తూర్పు కాపులకు జడ్పీ పీఠం కేటాయించాలి

***హామీ ఇచ్చే పార్టీకే మద్దతు *సంఘాల నేతలు**

**కొత్తూరు, ఆగస్టు 31 (వార్త):** ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో తూర్పు కాపు సామాజిక వర్గం తమ రాజకీయ భవిష్యత్తు కోసం గళమెత్తింది. జనాభాలో బలమైన శక్తిగా ఉన్నప్పటికీ రాజకీయ ప్రాతినిధ్యంలో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేసిన ఆ సంఘం నేతలు.. రాబోయే ఎన్నికల్లో జడ్పీ చైర్మన్ పదవిని తమకే కేటాయించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా తమ డిమాండ్‌కు స్పష్టమైన హామీ ఇచ్చే వారికే మద్దతు ఇస్తామని హెచ్చరించారు. కొత్తూరులోని గోగుల రామారావు నాయుడు షాపింగ్ మాల్ ఆవరణలో సోమవారం తూర్పు కాపు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన అత్యవసర సమావేశంలో నాయకులు రాజకీయ పార్టీల తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాలు ఉండగా, కేవలం పాతపట్నం నియోజకవర్గానికే పదవులు పరిమితం కావడం దారుణమన్నారు. రాజాం, పాలకొండ, ఎచ్చెర్ల వంటి ప్రాంతాల్లో లక్షలాదిగా తూర్పు కాపు జనాభా ఉన్నప్పటికీ, తగిన రాజకీయ ప్రాధాన్యం దక్కకపోవడంపై మండిపడ్డారు. ఈ ప్రాంతీయ వివక్షను ఇకపై సహించేది లేదన్నారు. మా డిమాండ్‌ను గుర్తించి, జడ్పీ చైర్మన్ పదవిని తూర్పు కాపులకు కేటాయిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చే రాజకీయ పార్టీలకే రానున్న ఎన్నికల్లో మా సంపూర్ణ మద్దతు ఉంటుంది" అని సంఘ నేత గోగుల వరప్రసాద్‌నాయుడు తేల్చిచెప్పారు. హక్కుల సాధన కోసం ఇకపై సంఘటితంగా పోరాటాలు ఉధృతం చేస్తామని, అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని వెంటనే స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తూర్పు కాపు సంఘాల ప్రముఖులు లోతుగెడ్డ జనార్ధన, చోడవరపు జోగినాయుడు, లోతుగెడ్డ తిరుపతి రావు, చోడవరపు సింహాచలం, సారిపిల్లి సోమేష్, కడగల రవికుమార్, ఎద్దు నాగరాజు, పెదకోట విజయ్, చోడవరపు నందీప్ తదితరులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు.



## అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

**పలాస, ఆగస్టు 31 (వార్త):** పలాస విద్యుత్ శాఖ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న 28 ఏళ్ల సంతోష్‌కుమార్ సోమవారం మృతి చెందాడు. కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన మృతిచెందడంతో ఉద్యోగ వర్గాల్లో ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన మృతికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. వ్యక్తిగత కారణాలతో పాటు ఉద్యోగపరమైన ఒత్తిళ్లు, విధుల్లో ఎదురైన ఇబ్బందులు తదితర అంశాలపై కూడా సమగ్రంగా విచారణ చేపట్టాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# పలాసను అభివృద్ధి చేశా.. ప్రజల గుండెల్లో నిలిచా!

**- రెండేళ్లలో ఏం చేశారో చెప్పాలి**

**- ఎమ్మెల్యే గౌతు శిరీషకు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సవాల్**

**-వైఎస్సార్‌సీపీ హయాంలోనే పలాస సమగ్ర అభివృద్ధి**

**-మూలపేట పోర్టు క్రెడిట్ కొట్టేయడం హాస్యాస్పదం**

**-కూటమి పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శ**

**పలాస, ఆగస్టు 31(వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా పలాస నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విమర్శించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష తన రెండేళ్ల పాలనలో నియోజకవర్గానికి ఏం చేశారో ప్రజలకు వివరించాలని, అభివృద్ధిపై రిపోర్టు కార్డు విడుదల చేసి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాశీబుగ్గలోని సూర్య ఇన్ కల్యాణ మండపంలో పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల పాత్రికేయులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

"పలాసను అభివృద్ధి చేసింది మేమే.. ప్రజల గుండెల్లో నిలిచింది కూడా మేమే" అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలాసలో కొత్తగా ఒక్క పెద్ద అభివృద్ధి పనైనా చేపట్టిందా? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు రిబ్బన్లు కట్ చేయడం తప్ప కొత్తగా చేస్తున్నదేమీ లేదని ఎద్దేవా చేశారు. తాత గౌతు లచ్చన్న, తండ్రి గౌతు శివాజీ పేర్లను చెప్పుకుని రాజకీయాలు చేయడం కాకుండా.. ఎమ్మెల్యేగా తన సొంతంగా నియోజకవర్గానికి ఏం చేశారో గౌతు శిరీష చెప్పాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లుగా గౌతు కుటుంబం పలాస, సోంపేట ప్రాంతాలకు చేసిన అభివృద్ధిపై కూడా ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. కక్ష సాధింపు రాజకీయాలను పక్కనపెట్టి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు.

### తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పలాస నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టామని అప్పలరాజు తెలిపారు. పలాస ప్రజల చిరకాల సమస్య అయిన తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టామన్నారు. దివంగత నేత హనుమంతు అప్పయ్యదొర రేగులపాడు ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేయగా.. తమ ప్రభుత్వం పనులను ముందుకు తీసుకెళ్లిందని చెప్పారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల తాగునీటి అవసరాల కోసం రూ.110 కోట్లతో ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చామని తెలిపారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు తాగునీరు అందించేందుకు రూ.700 కోట్లతో భారీ ప్రాజెక్టును చేపట్టినట్లు వివరించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

### గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

తమ ప్రభుత్వ హయాంలో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చామని అప్పలరాజు చెప్పారు. సిమెంట్ రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టామని తెలిపారు. పలాస పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రహదారుల విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడంలోనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుందని అన్నారు అన్నారు. బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో సుమారు 150 ఎకరాల్లో ఎంజె లేఅవుట్ ఏర్పాటు చేసి దాదాపు 2,500 మంది నిరుపేదలకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరు చేసినట్లు తెలిపారు. పేదలకు పెద్దఎత్తున ఇళ్ల స్థలాలు కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు.

### పోర్టు పనుల్లో మేమే కీలకం

మూలపేట పోర్టు నిర్మాణంపై కూడా అప్పలరాజు స్పందించారు. భూసేకరణ నుంచి నిర్మాణ పనుల వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే కీలక చర్యలు చేపట్టామని తెలిపారు. పోర్టు పనుల్లో దాదాపు 70 శాతం తమ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పుడు పోర్టు క్రెడిట్‌ను కూటమి



ప్రభుత్వం తీసుకునేందుకు ప్రయత్నించడం హాస్యాస్పదమని విమర్శించారు. పోర్టు పూర్తయితే పలాస ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని అన్నారు.

### పాత్రికేయులకు కృతజ్ఞతలు

తనపై గతంలో కేసులు నమోదైన సమయంలో పాత్రికేయులు వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువచ్చి అండగా నిలిచారని అప్పలరాజు అన్నారు. ఆ సహకారాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులు నిష్పాక్షికంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రావణి శ్రీనివాస్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పైల చిట్టిబాబు, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, మందస ఎంపీపీ డొక్కరి దానయ్యయాదవ్, పలాస పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, మాజీ ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్, మన్మథరావు, సేనాపతి కిషోర్, సుజాత పండా, ఉంగసాయి కృష్ణయాదవ్, సొర్ర ఢిల్లేశ్వరరావు, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, కంచరాన చినబాబు, పినకాన ముకుంద తదితరులు పాల్గొన్నారు.

## సోంపేట పార్కును అభివృద్ధి చేయండి



**సోంపేట, ఆగస్టు 31(వార్త):** సోంపేట మేజర్ పంచాయతీలో ఇంతవరకు పబ్లిక్ పార్క్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారని, అందుకు అవసరమైన స్థలం ఉన్నప్పటికీ పార్కును అభివృద్ధి చేయడం లేదని, వెంటనే దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో జడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద జోగారావు సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలో 50 శాతం మాత్రమే వర్షపాతం నమోదవడంతో చెరువుల్లో నీరు లేక చాలా విస్తీర్ణంలో వరి నాట్లు వేయలేదని వివరించారు. ఈ పరిస్థితుల్లో సోంపేటను కరువు మండ లంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

## పేద మహిళకు కుట్టు మిషన్ అందజేత



**సోంపేట, ఆగస్టు 31(వార్త):** సోంపేటకు చెందిన మేమున్నాం స్వచ్ఛంద సంస్థ సభ్యులు నిరుపేద మహిళ సింహాచలం నారాయణమ్మకు కుట్టు మిషన్‌ను సోమవారం అందజేశారు. 1987-88 స్థానిక పదో తరగతి విద్యార్థులు కలిసి మేమున్నాం సంస్థను ఏర్పాటు చేసి తద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. వితంతు మహిళ నారాయణమ్మ భర్తను కోల్పోయి ఇద్దరు ఆడపిల్లలతో అత్యంత పేదరికం అనుభవిస్తుంది. బజారు వీధిలో చిన్నపాటి కొట్టు ప్లాట్‌ఫాం మీద పెట్టుకొని డొక్కు మిషన్‌తో రిపేర్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈ నేపథ్యంలో ఆమెకు సహాయం అందించారు. ఆ సంస్థ సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు తడక మాధవరావు, నాగరాజు, కొత్తకోట మనోజ్, వాసుదేవ్ పాణిగ్రాహి, తెల్లి ధర్మారావు, జానకిరామ్, తిరుపతిరావు, సురేష్, సతీష్, వెంకటరమణ, పాపా రావు, దేవా, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

## ఒకేరోజు 12 గ్రామాల్లో పల్లెనిద్ర




**సోంపేట, ఆగస్టు 31(వార్త):** సోంపేట పోలీస్ సర్కిల్ పరిధిలో సోమవారం 12 గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. సీఐ మంగరాజు సారథ్యంలో సోంపేట, కంచిలి, బారువా ఎస్సైలు మోహిని, పారినాయుడు, హరిబాబు నాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలసి వివిధ గ్రామాల్లో ప్రజలతో మమేకమయ్యారు. ఆయాచోట్ల ముందుగా గ్రామ సభలు నిర్వహించారు. ఇటీవల కాలంలో రాత్రి వేళల్లో దొంగలు సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజ లందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తలుపులు పూర్తిగా లాక్ చేసి ఇంట్లో నిద్ర పోవాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరించిన యెడల వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. గ్రామాల్లో ఎటువంటి తగాదాలు విభేదాలు లేకుండా ప్రజలు శాంతియుతంగా ఐకమత్యంగా ఉండాలని కోరారు. వివాదాలు కొట్లాటల జోలికి వెళ్లి పోలీస్ కేసుల్లో ఇరుక్కోవద్దని హితవు పలికారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**పలాస, ఆగస్టు 31 (వార్త):** కాశీబుగ్గలో ఉత్తరాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉరసం అధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త కుత్తం వినోద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షులు, జానపద కళా పరిరక్షకులు మామిడి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను సంఘం తరపున శాలువా, మెమెంటో, ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చేసిన కృషి వల్లే నేడు తెలుగు భాష సామాన్య ప్రజలకు చేరువైందని కొనియాడారు. తెలుగు భాష అనేది కేవలం భాష మాత్రమే కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయం, మన ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ఉత్తరాంధ్ర మాండలికంలోని తియ్యదనం, సిక్కోలు జానపద సాహిత్యంలోని సహజత్వం, పల్లె పదాలలోని గొప్పతనం గురించి వక్తలు వివరించారు. ఈ నేపథ్యంలో జానపద సాహిత్యాన్ని, కోల్పోతున్న ఎన్నో జానపద కళారూపాలను పరిరక్షించడంలో, గ్రామీణ కళాకారులను వెలుగులోకి తీసుకువచ్చి వారికి గుర్తింపు తీసుకురావడంలో మామిడి కృష్ణారావు చేస్తున్న నిరంతర కృషి నిజంగా అభినందనీయమని, సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ద్వారా ఆయన అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని ఉరసం అధ్యక్షులు కుత్తం వినోద్ ప్రశంసించారు. అనంతరం మామిడి కృష్ణారావు మాట్లాడుతూ తనను సన్మానించిన ఉరసం సంఘ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాష అభివృద్ధికి, ముఖ్యంగా జానపద సాహిత్య పరిరక్షణకు తన శేష జీవితాన్ని అంకితం చేస్తానని, యువతలో తెలుగు భాషపై మమకారం పెంపొందించేందుకు కృషి చేసానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జానపద సాహిత్య కళావేదిక కవులు, ప్రతినిధులు డాక్టర్ కుమార్ నాయక్, తెప్పల కృష్ణమూర్తి, మద్దు నాగేశ్వరరావు, ఉరసం సంఘ ప్రతినిధులు, స్థానిక కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, సాహితీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఇంటింటికి తెలుగుదేశం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 31 (వార్త):** ఇచ్ఛాపురం మండలం క్లస్టర్ -1 పరిధిలో కీర్తిపురం, పాయతారి గ్రామాల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, క్లస్టర్ ఇన్‌చార్జి మెరుగు సూర్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గిన్ని బాలరాజు, లెంక మురళీకృష్ణ, వలపల నరహరి తదితరులు పాల్గొన్నారు.

## గోరువాని చెరువు అభివృద్ధికి శ్రీకారం

**-జల వనరులను పరిరక్షించి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం: అర్చన**



**నరసన్నపేట, ఆగస్టు 31 (వార్త):** నరసన్నపేట పట్టణ నడిబొడ్డున ఉన్న గోరువాని చెరువు అభివృద్ధికి చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన తెలిపారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచనలు, ఆదేశాల మేరకు చెరువు అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కూటమి నాయకులతో కలిసి గోరువాని చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. చెరువు పూడికతీత పనుల పురోగతిని పరిశీలించి, పనులను మరింత వేగవంతం చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పట్టణంలో కీలకమైన జలవనరుగా ఉన్న గోరువాని చెరువును సంరక్షించడంతో పాటు భవిష్యత్‌లో ప్రజలకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చెరువు అభివృద్ధి పనుల కోసం పంచాయతీ నిధుల నుంచి రూ.3.50 లక్షలు మంజూరైనట్లు బగ్గు అర్చన వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేసి, అనంతరం చెరువుకు నీటిని మళ్లించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. నీటి లభ్యతను పెంచడం ద్వారా చెరువు పునరుజ్జీవనానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. పట్టణంలో ఉన్న జలవనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాటిని ఆక్రమణలు, నిర్లక్ష్యానికి గురికాకుండా సంరక్షిస్తూ ప్రజలకు ప్రయోజనం చేకూరే విధంగా అభివృద్ధి చేయడమే తమ ప్రాధాన్యత అని అర్చన స్పష్టం చేశారు. చెరువు అభివృద్ధి పూర్తయితే పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయోజనం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్టాన్ ఫార్వర్డ్ స్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు

**కొత్తూరు, ఆగస్టు 31 (వార్త):** కొత్తూరు మండలం మెట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కర్లమ్మ సచివాలయ పరిధిలో ఉన్న స్టాన్ ఫార్వర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థుల ఆరోగ్యం పట్ల చక్కటి స్ఫూర్తిని నింపింది. ఈ శిబిరంలో ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకి రామయ్య విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న మొత్తం 84 మంది విద్యార్థులు ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వీరిలో లోపాన్ని సకాలంలో గుర్తించడం ద్వారా మెరుగైన దృష్టిని అందించేందుకుగాను, రాష్ట్ర ప్రభుత్వం తరపున త్వరలోనే ఉచితంగా నాణ్యమైన కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. చిన్న వయసులోనే కంటి సమస్యలను గుర్తించడం వల్ల పిల్లల చదువుకు, ఉజ్వల భవిష్యత్తుకు ఎటువంటి ఆటంకం ఉండదని తెలిపారు. ఇదే వేదికగా 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు, సిబ్బందికి నేత్రదానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మృత్యువు తర్వాత మన నేత్రాలు నలుగురి జీవితాల్లో చీకట్లను తొలగించి వెలుగులు నింపుతాయని, నేత్రదానం గొప్ప సామాజిక బాధ్యతని వక్తలు వివరించారు. సమాజంలో నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించి, మరణానంతరం చూపును ప్రసాదించే ఈ బృహత్తర యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ తులసి, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు క్రియాశీలకంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వైద్య శాఖ మరియు పాఠశాల యాజమాన్యం సంయుక్తంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు.



## నరసన్నపేటలో పెరిగిన శునకాల బెడద

**- వీధులు, కార్యాలయాల వద్ద గుంపులుగా సంచరిస్తున్న శునకాలు**

**- రెండు నెలల్లో నూటికి పైగా కుక్కకాటు ఘటనలతో ఆందోళన**

**- తక్షణ చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు ప్రజల విజ్ఞప్తి**



**నరసన్నపేట, ఆగస్టు 31 (వార్త):** నరసన్నపేటలో శునకాల బెడద రోజు రోజుకూ తీవ్రంగా పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన వీధులు, కాలనీలు, రద్దీ ప్రాంతాలతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లోనూ గుంపులుగా శునకాలు సంచరిస్తుండ డంతో స్థానికులు, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో శునకాల గుంపులు రహదారులపైకి రావడంతో ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురవు తున్నారు. చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా బయటకు వెళ్లేందుకు సైతం వెను కంజ వేస్తున్న పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ శునకం దాడి చేస్తుందోననే భయంతో ప్రజలు అప్రమత్తంగా రాకపోకలు సాగిస్తున్నారు. స్థానికుల సమా చారం ప్రకారం కేవలం రెండు నెలల వ్యవధిలోనే పట్టణంలో నూటికి పైగా మంది కుక్కకాట్లకు గురైనట్లు తెలుస్తోంది. దీంతో బాధితులు వైద్యం కోసం ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. శునకాల సంఖ్య పెరగడానికి ప్రధాన కారణాలను గుర్తించి, వాటి నియంత్రణకు శాశ్వత చర్యలు చేపట్టాల్సిన అవస రం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వ హణను మెరుగుపరచడంతో పాటు చెత్తను ఎక్కడికక్కడ పడేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆహార వ్యర్థాల కారణంగా శునకాలు జనావాసాల వైపు ఎక్కువగా వస్తున్నాయని, దీనిపై కూడా అధికారులు దృష్టి సారించాలని సూచిస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి శునకాల నియంత్రణకు సమగ్ర చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుని పట్టణ ప్రజలకు భయరహిత వాతావరణం కల్పించాలని కోరుతున్నారు.

## సంతతోటలో 'రెండేళ్ల నమ్మకం' ఇంటింటి ప్రచారం



**- అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించిన బగ్గు అర్చన**

**- కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాల సేకరణ**

**- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని వెల్లడి**

**నరసన్నపేట, ఆగస్టు 31 (వార్త):** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా నరసన్నపేట పట్టణంలోని సంతతోట పరిధిలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా వివిధ వర్గాలకు కలుగుతున్న ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలుసుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలు, పాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, సమస్యలను సంబంధిత నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే 'రెండేళ్ల నమ్మకం' కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా మరింత మెరుగైన పాలన అందించేందుకు అవకాశం ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి స్పందన లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మదనాపురంలో 'ఇంటింటికీ తెలుగుదేశం'



**సారవకోట, ఆగస్టు 31 (వార్త):** మదనాపురం గ్రామంలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్ పాల్గొని గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మదనాపురం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పిట్ట అప్పారావు, మాజీ సర్పంచ్ ప్రతినిధి పిట్ట సింహాచలం, సారవకోట ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సురవరపు తిరుపతి రావు, టీడీపీ యువనాయకుడు సాధు అప్పలనాయుడు, కిడిమి మాజీ సర్పంచ్ రొక్కం చిరంజీవి (దాస్), జమచక్రం మాజీ సర్పంచ్ బోర తాతయ్య, సారవకోట మండల తెలుగు యువత అధ్యక్షుడు పిళ్లా నందకిషోర్, టీడీపీ యువనాయకులు గొంటి శంకర్, చెంచాల చంద్రమౌళి, చీడి రత్నాకర్, దాసుపురం శ్రీను, మంగపేట గోవింద, మంగపేట భాస్కర్‌రావు, బొమ్మిక ఆదినారాయణ, అశోకం వెంకటరావు, అశోకం సంజయ్‌కుమార్, పొన్నాడ శ్రీనివాస్, పొన్నాన పాపయ్య, మదనాపురం గ్రామ పంచాయతీ కూటమి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేదలకు నాణ్యమైన వైద్యం అందాలి

**- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలపై నిర్లక్ష్యానికి తావులేదు**

**-వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి.. మందుల కొరత లేకుండా చూడాలి**

**- పలాస ప్రభుత్వ ఆసుపత్రి సేవలపై ఎమ్మెల్యే గౌతు శిరీష సమీక్ష**



**పలాస, ఆగస్టు 31 (వార్త):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సూచించారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం వైద్య సేవల పరిస్థితి, రోగులకు అందుతున్న సదుపాయాలపై వైద్యాధికారులు, వైద్యులతో ఆమె సమీక్ష నిర్వహించారు.

### అందుబాటులో ఉండాల్సిందే..

ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందుతున్నాయా? వైద్యులు, సిబ్బంది విధుల్లో అందుబాటులో ఉంటున్నారా? రోగులకు అవసరమైన మందులు లభిస్తున్నాయా? తదితర అంశాలపై ఎమ్మెల్యే అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స ఆలస్యం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రధానంగా పేద, మధ్యతరగతి కుటుంబాలే ఆధారపడుతున్నందున వారి ఇబ్బందులను అధికారులు, సిబ్బంది అర్థం చేసుకోవాలని అన్నారు. రోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా మానవతా దృక్పథంతో స్పందించాలని సూచించారు.

### మందుల కొరతకు చోటివ్వొద్దు

ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రోగులు బయట నుంచి మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తకుండా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. వైద్య సేవలతో పాటు పరిశుభ్రత, మౌలిక వసతులు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

### సమన్వయంతో సేవలు అందించాలి

వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల నాణ్యత మెరుగుపడుతుందని గౌతు శిరీష అన్నారు. విధుల నిర్వహణలో జాప్యం, నిర్లక్ష్యం వల్ల రోగులు ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా చూడాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, వైద్య సేవలు అందేలా వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

### మౌలిక వసతులపై దృష్టి

ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు, ఇతర అవసరాలపై కూడా ఎమ్మెల్యే ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల నాణ్యత, సిబ్బంది అందుబాటు, మందుల లభ్యత వంటి అంశాలు నేరుగా ప్రజల ఆరోగ్య భద్రతతో ముడిపడి ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే నిర్వహించిన సమీక్షకు ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా ప్రైవేటు వైద్యం భరించలేని కుటుంబాలకు ప్రభుత్వ ఆసుపత్రే ప్రధాన ఆధారంగా ఉన్నందున సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సమీక్షలో డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ పాపినాయుడు, వైద్యాధికారులు, వైద్యులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ దృష్టికి ఇచ్ఛాపురం సమస్యలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 31 (వార్త):** గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్‌దినకర్‌కి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు,వార్డ్ లకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి వినతిపత్రం అందజేశారు.



– ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట డయాలసిస్ కేంద్రాలకు అనుసంధానం చేస్తూ రోగులకు సేవలు అందించేందుకు ఒక నెఫ్రాలజిస్ట్‌ను నియమించాలని కోరారు.

–ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 20 వార్డ్ నందు తాగునీరు, విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కొరకు, ఇచ్ఛాపురం నుంచి బెల్లుపడ వైపు మలుపు తిరుగు ప్రాంతంలో ప్రమాదకరంగా గల విద్యుత్ స్తంభం దారికి దూరంగా ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు (కమిషనర్‌కు, ఏఈ)లకు కోరిన ఫలితం లేదని చివరి ప్రయత్నంగా కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చినట్లు చెప్పారు.

–బెల్లుపడ –ఈదుపురం మార్గంలో హైవే దాటే ప్రాంతంలో ఆర్‌వోబీ మంజూరు చేసినప్పటికి పనులు ప్రారంభం జాప్యం జరుగుతుందని, పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకొనగలరని కోరారు.(ఇదే ప్రాంతంలో గత 4ఏళ్లలో 24 మంది ప్రమాదాలకు గురైనట్లు వివరించారు).

– అరకభద్ర వద్ద బహుదా వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మాణం పనులు పూర్తిచేసేలా సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. (రక్షణ గోడ లేకపోతే వరదకు వంతెనకు మార్గం కొట్టుకొని పోతుందని తెలిపారు.

–ఇచ్ఛాపురం మండలం, కొఠారి పంచాయతీ పరిధిలో 5.5 ఎకరాలు ప్రభుత్వ భూములు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

–కవిటి మండలం దుగానపుట్టుగ – గోవిందపుట్టుగ రహదారి మార్గం అత్యంత దారుణంగా తయారైంది. ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగు తున్నాయి, రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

– కవిటి మండలం పీకే పాలెం లో జరిగిన అగ్ని ప్రమాదంలో పడవలు, వలలు నష్టపోయి జీవనాధారం కోల్పోయిన మత్యాకారులకు ప్రభుత్వం నుంచి నేటి వరకు సహకారం అందలేదని, వారికి వెంటనే సహాయం అందించాలని కోరారు.

– కంచిలిలో కిడ్నీ రోగులకు డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని , జాడుపూడి పరిధిలో గల కస్తూరిబా కళాశాలలోని విద్యార్థులు ఇబ్బంది పడుతున్న పలు సమస్యల పరిష్కారానికి, సోంపేట మండలం దామోదరపురానికి బీటీ రోడ్డు నిర్మాణానికి, ఉపాధి హామీ పథకం ద్వారా అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. ఇచ్ఛాపురంలోని వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం సిలిండర్ల బుకింగ్ వ్యవధి 45 రోజుల నుంచి 25 రోజులకు తగ్గించాలని మరోసారి విన్నవించారు.

– ఇచ్ఛాపురం ప్రభుత్వ బాలికల పాఠశాలలో వాచ్‌మాన్‌గా పనిచేస్తున్న వ్యక్తికి గత 8 నెలలుగా జీతం అందక ఇబ్బంది పడుతున్నారని, జీతం వెంటనే మంజూరు చేయగలరని కోరారు.

– ఇచ్ఛాపురం నందు గల డయాలసిస్ కేంద్రంలో అదనపు సిబ్బంది, రోగులకు అవసరమైన మందులు, ఇంజక్షన్ లు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఆయన విన్నవించారు.

# అంబుసోలి

**- ఇంటింటికీ తాగునీటి సరఫరాకు శ్రీకారం**

**-రూ.16.18 లక్షలతో పైప్‌లైన్ పనుల ప్రారంభం**

**-హర్షం వ్యక్తం చేసిన గ్రామస్థులు**



**పలాస, ఆగస్టు 31 (వార్త):** ఏళ్ల తరబడి వెంటాడుతున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో అంబుసోలి గ్రామ ప్రజల కల సాకారమైందని స్థాని కులు హర్షం వ్యక్తం చేస్తున్నారు . పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో ఇంటింటికీ మంచినీరు అందించేందుకు పైప్‌లైన్ పనులకు సోమ వారం శ్రీకారం చుట్టారు. రూ.16,18,365 అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ పనులు పూర్తయితే గ్రామంలోని ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా తాగునీరు అందనుంది.

అంబుసోలి గ్రామం చుట్టుపక్కల నీటి వనరులు ఉన్నప్పటికీ స్థానికులకు తాగునీటి సమస్య మాత్రం ఏళ్లుగా శాపంగా మారింది. ముఖ్యంగా వేసవి కాలంలో సమస్య తీవ్రరూపం దాల్చడంతో మంచినీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడేవారు. దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదు.

### ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో..

నాలుగో వార్డులో తాగునీటి ఇబ్బందులను స్థానికులు పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి.

### ఇంటింటికీ కొళాయిలు

రూ.16,18,365 అంచనా వ్యయంతో చేపడుతున్న పైప్‌లైన్ పనులు పూర్తయిన అనంతరం అంబుసోలి గ్రామంలోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా మంచినీరు సరఫరా కానుంది. దీంతో ఇప్పటివరకు నీటి కోసం పడుతున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 16 ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యకు కార్య రూపంలో పరిష్కారం లభించడంతో అంబుసోలి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభమయ్యేలా కృషి చేసిన చెల్లూరు రామకృష్ణతో పాటు ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇంటింటికీ మంచినీరు అందుబాటులోకి రావడం గ్రామ ప్రజలకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని తెలిపారు.

# నేత్రదానం.. మరొకరి జీవితానికి వెలుగు

**-పలాసలో నేత్రదాన పక్షోత్సవాలపై అవగాహన**

**-కరపత్రాలు విడుదల చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష**




**పలాస, ఆగస్టు 31 (వార్త):** నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా పలాసలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమాల సందర్భంగా నేత్రదానం ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నేత్రదానంపై రూపొందించిన కరపత్రాలను సోమవారం టీడీపీ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా దృష్టిని కోల్పోయిన వారికి వెలుగును అందించవచ్చన్నారు. నేత్రదానం గొప్ప మానవతా సేవ అని అన్నారు. ప్రతి కుటుంబం ముందుగానే నేత్రదానంపై నిర్ణయం తీసుకుని, కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. నేత్రదానంపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నేత్రదానంతో మృతుల ముఖ సౌందర్యానికి ఎలాంటి హాని కలగదని తెలిపారు. యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు నేత్రదానంపై అవగాహన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. "మరణం తర్వాత కూడా మరొకరి జీవితంలో వెలుగుగా నిలవడం కంటే గొప్ప సేవ మరొకటి లేదు. మన కళ్ల దానం.. మరొకరి జీవితానికి వెలుగు" అని ఎమ్మెల్యే శిరీష తెలిపారు. నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌ఎస్ సూపరింటెండెంట్ టి. పాపినాయుడు, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, హెచ్డీస్ సభ్యులు ఎస్.రాంబాబు, ఎం.శ్రీను, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కాంట్రాక్టు వైద్య సిబ్బంది ఉద్యమబాట

**పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో శాంతియుత నిరసన**

**- ఆన్‌లైన్ విధుల నిలిపివేత**

**- డిమాండ్లు పరిష్కరించకుంటే దశలవారీ ఆందోళన**



**పలాస, ఆగస్టు 31 (వార్త):** పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగులు తమ న్యాయపరమైన డిమాండ్ల సాధనకు ఉద్యమబాట పట్టారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ఐకాస ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రి ప్రాంగణంలో శాంతియుత నిరసన చేపట్టారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఆందోళనలో భాగంగా కాంట్రాక్టు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఆన్‌లైన్ విధులను నిలిపివేశారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్నా తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, న్యాయపరమైన హక్కులు, సేవలకు తగిన గుర్తింపు తదితర అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టకపోతే ఆందోళనలను దశలవారీగా ఉద్ధృతం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు. సెప్టెంబరు 2, 3 తేదీల్లో ఆందోళన కార్యక్రమాలు, 6న ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నిరసనలు, 7న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు సిబ్బంది వైద్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది రోగులకు నిరంతరం సేవలు అందిస్తున్నారు. తమ సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందని వారు వ్యక్తం చేశారు. ఆందోళనలు మరింత విస్తరిస్తే ఆసుపత్రుల్లో రోజువారీ పరిపాలనా కార్యకలాపాలు, వైద్య సేవలపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం సమస్యలను సత్వరం పరిష్కరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో రోగులకు ఇబ్బందులు కలగకుండా నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తూ, ప్రభుత్వం ఉద్యోగులతో చర్చలు జరిపి 0న్యాయపరమైన డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కాంట్రాక్టు సిబ్బంది కోరుతున్నారు.

ఈ నిరసన కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు ముకుంద, కవిత, అశ్విని, శ్రీదేవి, స్వాతి, జ్యోతి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి 'ప్రజా దర్బార్'

**-36 మంది నుంచి వినతులు**

**- అధికారులకు తక్షణ చర్యల ఆదేశం**



**పలాస, ఆగస్టు 31 (వార్త):** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో నియోజకవర్గ శాసనసభ్యురాలి కార్యాలయంలో సోమవారం 'ప్రజా పరిష్కార వేదిక–ప్రజాదర్బార్' నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా 36 మంది ప్రజలు వివిధ సమస్యలపై వినతులు అందజేశారు. ప్రధానంగా పింఛన్లు, గృహ నిర్మాణాలు, కాలువల శుభ్రత, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, విద్యుత్ సమస్యలు, జంగిల్ క్లియరెన్స్ రోడ్లకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను శ్రద్ధగా విని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని ఎమ్మెల్యే శ్రద్ధగా పరిశీలించారు. సమస్యల తీవ్రత, స్థానిక పరిస్థితులను తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజాదర్బార్ ఒక వేదికగా నిలుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండటం తమ ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేస్తే సంబంధిత అధికారుల దృష్టికి వెంటనే తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

### మౌలిక వసతులపైనే ఎక్కువ ఫిర్యాదులు

ప్రజాదర్బార్‌లో అందిన వినతులను పరిశీలిస్తే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు ప్రధానంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. తాగునీరు, రహదారులు, కాలువల శుభ్రత, విద్యుత్, జంగిల్ క్లియరెన్స్ వంటి సమస్యలు ప్రజల రోజువారీ జీవనంపై ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు పింఛన్లు, గృహ నిర్మాణాలకు సంబంధించిన సమస్యలు కూడా పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వీటిని శాఖల వారీగా పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం ప్రజల్లో వ్యక్తమైంది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546